క్లుప్తంగా

గ్రేటర్‌లో కలపొద్దని వినతి

హయత్‌నగర్: ఔటర్ రింగురోడ్డుకు వెలుపల ఉన్న తమ గ్రామాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయొద్దని అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తారామతిపేట్, బాచారం గ్రామస్తులు శనివారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆయా గ్రామాల ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, భూమి లేని వారు ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామీణ వాతావరణంలో జీవిస్తున్న తమను గ్రేటర్‌లో విలీనం చేస్తే అధిక పన్నులు భరించలేరని ఎమ్మెల్యేకు విన్నవించారు.

'పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి'

ఆమనగల్లు: రాష్ట్రంలోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని జిల్లా ఆర్యవైశ్యసంఘం ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ కోరారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం వీరబొమ్మ రామ్మోహన్ విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుకు బదులు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వం భావించడం సరైందికాదని అన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం, తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్షతో ఆత్మబలిదానం చేసి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రాన్ని సాధించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన మహానీయుడని కొనియాడారు. పొట్టి శ్రీరాములు ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో చెందిన వ్యక్తి కాదని అతని జ్ఞాపకార్థం తెలుగు విశ్వవిద్యాలయానికి పేరు పెట్టారని గుర్తుచేశారు.

నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి నేతలు

ఇబ్రహీంపట్నం: జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వ మోసం చేసిందని బీఆర్‌ఎస్ అనుబంధ సంస్థల నేతలు శనివారం ఇబ్రహీంపట్నంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ యువజన, విద్యార్థి నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మడుపు శివసాయి, బీఆర్‌ఎస్‌వై అధ్యక్షుడు ముత్యాల వినోద్, ప్రవీణ్‌నాయక్, గణేశ్‌గౌడ్, కొంద్రు మహేశ్, సురేష్, చింతకింది వీరేష్, సొప్పరి కరుణాకర్, పల్లె అనిల్, శ్రీధర్‌గౌడ్, మణికంఠగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మల్లు రవికి సత్కారం



మల్లురవిని సత్కరిస్తున్న గుర్రం కేశవులు

ఆమనగల్లు: ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లురవిని శనివారం పలువురు ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో మల్లురవిని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్ల రవికాంత్‌గౌడ్ తదితరులు ఘనంగా సత్కరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి నిరుద్యోగుల కలలను సాకారం చేస్తుందని జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం విడుదల చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ ఇబ్రహీంపట్నంలో శనివారం ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి జెడ్పీహెచ్‌ఎస్, 2001–02లో పది చదివిన 65 మంది విద్యార్థులు చిన్ననాటి స్నేహితులకు సహాయ సహకారాలు అందజేస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కానుగుల జంగయ్య కుటుంబంతో పాటు, భర్త చనిపోయిన పద్మ కుటుంబానికి చేయూత నందించారు. జంగయ్య భార్య హేమలతకు రూ.15వేలు, పద్మకు రూ.35,000 అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



ఆమనగల్లు: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వసంత



మాడ్గుల: మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మావతి



మంచాల: మాట్లాడుతున్న సుభాషిణి తదితరులు



తలకొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ, తదితరులు



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి



యాచారం: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

- ప్రతీఒక్కరి భాగస్వామ్యం అవసరం: ఎంపీడీఓలు
- మొక్కలు నాటేవిధంగా అవగాహన కల్పించాలి
- రేపటి నుంచి స్వచ్ఛదనం–పచ్చదనం మొదలు

ఇబ్రహీంపట్నం: స్వచ్ఛదనం–పచ్చదనంపై మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువతను, మహిళలను, ప్రజలను భాగస్వాములను చేయలన్నారు. ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ లక్‌పతినాయక్ పాల్గొన్నారు.

ఆమనగల్లు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాల్లో స్వచ్ఛదనం, పచ్చదనంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుసుమమాధురి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం నిర్వహించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ వసంత, ఎంఈఓ సర్దార్‌నాయక్, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి మంజులాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

స్వచ్ఛదనం, పచ్చదనం విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ వసంత ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: మండలంలో స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేయాలని ఎంపీడీఓ పద్మావతి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో అధికారులతో కార్యక్రమ నిర్వహణపై దిశ నిర్దేశం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామపంచాయతీ వారీగా టీంలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

మంచాలలో..

మంచాల: మండల కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్వచ్ఛదనం–పచ్చదనం విజయ వంతం చేయాలని మంచాల మండల ప్రత్యేకాధికారి సుభాషిణి పేర్కొన్నారు. 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో ప్రతీఒక్కరి భాగస్వామ్యం అవసరన్నారు.

ఆరుట్లలో....

ఆరుట్ల గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాలను సుభాషిణి పరిశీలన చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం గోతులు తీసి మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. ఎంపీడీఓ బాల శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీకాంత్ సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పారిశుద్ధ్యం, పచ్చదనం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకంతో కలుగు దష్ప్రభావం, వర్షపు నీరు నిల్వ, తాగునీరు, వాటర్ ట్యాంకులను శుభ్రపర్చడం, మురుగు కాల్వలు, ఆరోగ్యం, వీధి కుక్కల బెడద, తదితర విషయంలో తగిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఎంపీఓ రఘు, ఏఓ రాజు, పశువైద్యాధికారి శంకర్, ఏపీఓ కృష్ణ, హెచ్ఈఓ ఆంజనేయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్: స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ పిలుపునిచ్చారు. ఆమె అధ్యక్షతన రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాచారం: స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేద్దామని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ కాల్వలు, కాలనీల రోడ్లను శుభ్రం చేద్దామన్నారు. నీటి ట్యాంకులు శుభ్రం చేసి పైకప్పులు ఏర్పాటు చేయించాలన్నారు. మండల పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి స్పోర్ట్స్ పాలసీ

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రామ్మోహన్, మల్లేశ్

ఆమనగల్లు: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ అమలు చేయనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. అన్ని మండల కేంద్రాలలో మినీ స్టేడియాల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆమనగల్లు బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, కార్యదర్శి కొత్ర మల్లేశ్, సభ్యుడు ఆనంద్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డిని బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలో ఇండోర్‌స్టేడియం నిర్మించాలని ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి, క్రీడాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధులు కేటాయించి పనులు చేపట్టిందన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను నిర్వహించిందని చెప్పారు. ఉపాధ్యాయుల భర్తీకి డీఎస్సీ నిర్వహిస్తుందని వివరించారు. అలాగే క్రీడాభివృద్ధికి ప్రత్యేక పాలసీ తీసుకువస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతీ మండల కేంద్రంలో మినీ స్టేడియాలు నిర్మించడంతో పాటు ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం



మాట్లాడుతున్న సీఐ శంకర్‌కుమార్

యాచారం సీఐ శంకర్‌కుమార్

యాచారం: విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, చెడు అలవాట్లకు గురి కావొద్దని యాచారం సీఐ శంకర్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో శనివారం సైబర్‌క్రైమ్స్ అవేర్‌నెస్, డయల్ 100, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి విద్యార్థి దశ ఎంతో విలువైందన్నారు. గొప్ప లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు గురైతే భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. మెరుగైన చదువు, ఉచిత భోజనానికి ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుందని, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. డ్రగ్స్ వాడుతున్నట్లు గుర్తిస్తే, ర్యాంగింగ్ జరిగిన వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాసం

యాచారం: ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీపై పశుగ్రాసం, విత్తనాలు అందించనున్నట్లు మండల పశువైద్యాధికారి రేఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు ముఖ్యంగా బొండ జొన్న విత్తనాలను రాయితీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు పట్టాదారు, పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలు, 5 కేజీల బ్యాగును తెచ్చుకోవాలని ఆమె సూచించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

- జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ
- అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వర్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతిఒక్కరూ అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వర్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లోని శ్రీనివాస స్కూల్‌లో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి మెలకువలు పాటించాలో అధికారులు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్, లీడింగ్ ఫైర్‌మాన్ కాదిల్‌లు మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ లీకై అందులోనుంచి మంటలు వచ్చినప్పుడు ఎలాంటి భయం లేకుండా ఆర్పేయాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే 101కు డయల్ చేయాలని సూచించారు. దీంతో వారి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడిన వారవుతారని తెలిపారు. విద్యార్థులు చదువుకునే దశ నుంచే ఇలాంటి ఘటనలపై అవగహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్కరాజు రాధిక, చైర్మన్ లక్కరాజు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

19న నూలుపూర్ణిమ గాయత్రీ యజ్ఞం

ఆమనగల్లు: పట్టణంలోని భక్త మార్కండేయస్వామి దేవాలయంలో ఈ నెల 19న నూలుపూర్ణిమ గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ తెలిపారు. పట్టణంలోని భక్త మార్కండేయస్వామి దేవాలయంలో శనివారం జరిగిన సమావేశంలో నూలుపూర్ణిమ గాయత్రీయజ్ఞం కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

వర్గీకరణను నిరసిస్తూ ఆందోళన

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఇబ్రహీంపట్నంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నల్ల రిబ్బన్లు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు పలువురు మాట్లాడారు. రాజ్యాంగంలోని 341 ఆర్టికల్‌కు విరుద్ధంగా తీర్పు ఇవ్వడం సరైందికాదన్నారు. పార్లమెంట్‌లో 3/4 మెజార్టీ సభ్యుల ఆమోదంతో చట్టం చేయాలని, అలాకాకుండా అదరాబాదరాగా వర్గీకరణ చేయడాన్ని ఆక్షేపించారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమైన తీర్పు అన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఈ కేసును కొట్టి వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆగస్టు 7, 8, 9 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న సామాజిక చైతన్య పోరాట దీక్షలకు పెద్దయెత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భర్తకి జగన్, మాజీ కౌన్సిలర్ ఈగల రాములు, మాల మహానాడు, దళిత సంఘాల నాయకులు బండి మహేశ్, హనుమండ్ల కిష్టయ్య, అంగత్‌కుమార్, చిక్కుడు గుండాలు, యాదగిరి, పోచన్న, వై లక్ష్మయ్య, మాదరి శివకుమార్, బండి నర్సింగ్‌రావు, శ్రీహరి, భారతమ్మ, హంసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

ఇబ్రహీంపట్నం రూరల్: కాటమయ్య బోనాలు ఆదిబట్లలో శనివారం ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తులు ఉదయం బోనాలు ఊరేగించి ఆటపాటలతో డప్పు సప్పుళ్లతో పోతురాజుల విన్యాసాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ముఖ్య అతిథులుగా మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈసీ శేఖర్‌గౌడ్, రజినీకాంత్‌గౌడ్, ముస్తాదర్ సాంబయ్యగౌడ్, ప్రవీన్‌గౌడ్, కోరే జంగయ్య, పాండురంగారెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న సత్తయ్య

టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: రైతు సేవా సహకార సంఘాలు రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాయని తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తెలిపారు. శనివారం సహకార సంఘం పాలకవర్గం సమావేశం సత్తయ్య అధ్యక్షతన తుర్కయంజాల్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. దీన్ని రుజువు చేస్తూ ఇటీవల ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ హామీని నెరవేర్చిందని గుర్తుచేశారు. అనంతరం సంఘంలో నూతనంగా 50 మందిని చేర్చుకోవడం, 18 మంది రైతులకు రూ. కోటి 39 లక్షలు రుణం మంజూరు చేసే తీర్మాణాలను చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మే 1వ తేదీ నుంచి జూలై 31 వరకూ జమ, ఖర్చులను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, కొంద్రు స్వప్న శ్రీనివాస్, సామ సంజీవ రెడ్డి, చాపల యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి, సెక్రటరీ వై రాందాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో మరుగుదొడ్లు శిథిలమై పోయాయన్నారు. విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణంలోని మైదానం గుంతలమయం అయ్యిందన్నారు. వర్షం నీరు గుంతల్లో చేరి విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడుకునేందుకు ఆట స్థలం లేక ఇబ్బందులకు గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కార్డులు అందజేయాలని వినతి



ఏఎల్‌ఓ ప్రమీలను సన్మానిస్తున్న అశోక్

కడ్తాల్: 18 నుంచి 55 సంవత్సరాలులోపు కూలీలకు కార్మిక శాఖ ద్వారా లేబర్ కార్డులు అందజేయాలని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్ కోరారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన ప్రమీలను శనివారం అశోక్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మికులకు అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలపై ఏఎల్‌ఓ ప్రమీలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, సురేశ్, మల్లేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దింపుడు కళ్లంను ఎవరో కూల్చి వేశారని..

మాదిగల శ్మశానవాటికలో దింపుడు కళ్లంను ఎవరో కూల్చి వేశారని, సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు మాదిగ కులస్తులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, గురిగళ్ల జంగయ్య, సిద్దిగారి జంగయ్య, పోతగళ్ల పెంటయ్య, ముత్తి సాలయ్య, కాలే జంగయ్య, కంబాలపల్లి అంజి, మంకి వెంకటేశ్, ముసిలి నర్సింహ, సిద్దిగారి సురేశ్, కాలే అంజయ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



కడ్తాల్: మాట్లాడుతున్న శబరి



తలకొండపల్లి: చౌదర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బోనాలతో చిన్నారులు

కడ్తాల్: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి మాట్లాడుతూ బిడ్డపుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టాలన్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు మీనా, ఆశ కార్యకర్తలు రజిత, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: తల్లి పాలు శిశువుకు సంపూర్ణ పౌష్ఠికాహారం అని హెచ్ఈఓ ఆంజనేయులు పేర్కొన్నారు. తల్లి పాలల్లో రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలపై అవగాహన కార్యక్రమం–బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తల్లి పాలలో బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలు, విటమిన్స్, మినరల్స్, ప్రోటీన్స్, లభిస్తాయని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్స్ నిర్మల, ఏఎన్‌ఎంలు సువర్ణ, సుజాత, ఆశా వర్కర్ మాధవి, శేఖర్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాజీ శంకర్ సూచించారు. కోహెడా క్లస్టర్‌లోని కొత్తగూడెం, బాటసింగారం గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాల్లో నిర్వహించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

ట్రాన్స్‌కో డీఈ యాదగిరి

ఇబ్రహీంపట్నం రూరల్: వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు వచ్చిన సత్వరమే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ డీఈ యాదగిరి సూచించారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో బొంగ్లూర్ సమీపంలోని ఏరోసిటీలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షకాలంలో అక్కడక్కడ స్తంభాలు విరగడం, విద్యుదాఘాతానికి గురవడం వంటివి జరుగుతున్నాయన్నారు. ఇలాంటి విషయంలో ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలన్నారు. ఇండ్లపై వ్రేలాడే విద్యుత్ తీగలను తొలగించేందుకు సహకరించాలని తెలిపారు. ప్రమాదాలు సంభవించినప్పుడు కూడా వెంటనే స్పందించాలన్నారు. వినియోగదారులు బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు.